సాక్షి గుంటూరు

శనివారం । 15 । జూన్ । 2024

I



దేవస్థానం వద్ద అన్నదానం

తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థానం కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని దేవస్థానం ఆవరణలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు.



విద్యా సామగ్రి పంపిణీ

ఫిరంగిపురం: పాఠశాలలకు శుక్రవారం విద్యా సామగ్రి అందజేసినట్టు ఎంఈవోలు మహబూబ్ సుభాని, రవికాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు



శావల్యాపురం: గంటావారిపాలెం గ్రామంలోని గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయం వార్షికోత్సవం శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సౌభాగ్యశర్మ శుక్రవారం తెలిపారు.

చేనుకు చలో

ఖరీఫ్‌కు సన్నాహాలు

- వరుణుడి పలకరింపు
- రుతుపవనాల రాకపై శుభ సంకేతాలు
- సాగుకు కర్షకులు సిద్ధం
- అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు
- ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై అందజేతకు ఏర్పాట్లు
- జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 1.26 లక్షల హెక్టార్లు
- 35,646.86 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం



సాక్షి ప్రతినిధి గుంటూరు: వేసవి తాపం కాస్త శాంతించింది. వారం రోజులుగా జిల్లా చల్లబడింది. వరుణుడి కరుణతో అడపాదడపా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రబీ సీజన్‌లో వేసిన పంటల కోతలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్నారు. నాగలి పట్టి చేనుకు పయనమయ్యేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పొలాలను సిద్ధం చేసుకునే పనిలో తలమునకలవుతున్నారు. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ ఖరీఫ్ సాగు ప్రణాళికలు రూపొందించింది. సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీపై అందిస్తోంది.

1,25,914 హెక్టార్లలో సాగు

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 1,25,914 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించింది. వరి 63,733 హెక్టార్లలో, పత్తి 26,982 హెక్టార్లలో, మిరప 20,625, మినుము 2,417, కూరగాయల పంటలు 2,198 హెక్టార్లలో సాగవుతాయని అంచనా వేసింది.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఖరీఫ్ సాగులో భూసారాన్ని పెంపొందించడంలో పచ్చిరొట్ట విత్తనాలు కీలక భూమిక పోషిస్తాయి. పశువుల ఎరువులకు ప్రత్యామ్నాయంగా వినియోగించే ఈ విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అవసరమైన విత్తనాలను వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచింది. 324 క్వింటాళ్ల జీలుగ, 473.42 క్వింటాళ్ల జనుము, 1105.30 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలను ముందస్తుగానే అందుబాటులో ఉంచింది. జీలుగ, జనుము విత్తనాల కిలో ధర రూ.88 కాగా రూ.44లకు, పిల్లిపెసర కిలో ధర రూ.134 ఉండగా, రాయితీపై కేవలం రూ.67లకే అందజేస్తోంది.

విత్తనాలు సిద్ధం

ఖరీఫ్‌లో రైతులు అత్యధికంగా వరి, పత్తి, మిరప పంటల సాగు చేపడతారు. వారికి అవసరమైన అన్ని రకాల విత్తనాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. వరి విత్తనాలు 40 వేల క్వింటాళ్లు అవసరమవుతాయని అంచనా వేసి ఇప్పటికే 25 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. అలాగే పత్తి విత్తనాలు 1.35 లక్షల ప్యాకెట్లు, మిరప విత్తనాలు 5.16 లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయని అంచనా వేసి ఇప్పటికే విత్తన కంపెనీల డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీచేశారు. వరికి సంబంధించి ఎకరానికి నాలుగైదు సెంట్ల విస్తీర్ణంలో మాత్రమే నారుమడులు వేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎకరానికి 25 కిలోల విత్తనాలు సరిపోతాయని చెబుతున్నారు. విత్తన శుద్ధి చేసిన వాటిని మాత్రమే సాగుకు ఉపయోగించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

60,083 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

ఖరీఫ్‌లో ఆశించిన మేర దిగుబడులు రావాలంటే నాణ్యమైన ఎరువుల ఆవశ్యకత ఎంతైనా ఉంది. నకిలీల బారిన పడి రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 60,083 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 35,646.86 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. రైతులు తమకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేలు, సొసైటీలు, డీలర్ల వద్ద పొందవచ్చు. సాధ్యమైనంత వరకూ సేంద్రీయ ఎరువులనే వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.



విత్తనాల కొనుగోలులో జాగ్రత్త!

- ఖరీఫ్ సాగుకు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.
- వ్యవసాయశాఖ అధీకృత లైసెన్స్ పొందిన కంపెనీ డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనాలి.
- కొనుగోలు సమయంలో డీలరు నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి.
- విత్తన సంచి, ట్యాగ్‌ను పంట కాలం చివరి వరకూ భద్రంగా ఉంచుకోవాలి.
- పంట సాగు చేసే ముందే మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.
- ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకుని వెళ్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వీలుంటుంది.
- ముఖ్యంగా పత్తి, మిరప విత్తనాల కొనుగోలులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఖరీఫ్‌కు సిద్ధంగా ఉన్నాం

ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నాం. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట, వరి, పత్తి, మిరప విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నాం. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు ఆర్‌బీకేల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది రుతుపవనాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంది. పంట సాగు సైతం లాభదాయకంగా మారనుంది. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. సాగుపై రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించాం.

– నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి

గోవధ చేయకండి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చిత్రంలో ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు వెస్ట్: బక్రీద్ సందర్భంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అందరూ పాటించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. జంతు హింస నివారణ చట్టాల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఎస్పీ తుషార్‌డూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17న బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. దీనికి సంబంధించి హైకోర్టు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే వివిధ శాఖలతో కమిటీలు ఏర్పాటు చేసి నిఘా పెట్టామని పేర్కొన్నారు. జంతువుల అక్రమ రవాణా జరగకుండా, ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టామని చెప్పారు. గోవులను వధించరాదని స్పష్టం చేశారు. చూడు గేదెలు, మూడు నెలల దూడలు కలిగిన పశువులను వధించొద్దని పేర్కొన్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ పండుగ అంటే అందరూ కలిసి జరుపుకోవాలని తెలిపారు. గతంలో చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల అమలుపై పోలీసులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. జంతు హింస నివారణ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, చట్టాలు ఉల్లంఘన జరిగితే సమాచారం అందించాలని సూచించారు.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



కొరిటెపాడు(గుంటూరు): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అమ్మాలని గుంటూరు విత్తన తనిఖీ స్క్వాడ్, పురుగుమందుల పరీక్ష కేంద్రం ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి సూచించారు. రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆమె ఏటుకూరు రోడ్‌లోని సిద్ధార్థ సీడ్స్, ఆదిత్య సీడ్స్, కావేరి సీడ్స్ గిడ్డంగులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లైసెన్సులు, స్టాకు రిజిస్టర్లు పరిశీలించి గిడ్డంగుల్లో నిల్వలను తనిఖీ చేశారు. క్రిస్టల్ కంపెనీలో స్టాకు రిజిస్టరు లేని కారణంగా రూ.15,81,120 విలువ గల 1,830 పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలు నిలిపివేశారు. తిరుమలాదేవి మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించకుండా, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, నాసిరకమైన విత్తనాలు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో గుంటూరు అర్బన్ ఏఓ బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 31,130 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,324 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 31,130 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,000 నుంచి రూ.17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 20,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి 10,588 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మిర్చి యార్డుకు సెలవులు


కొరిటెపాడు(గుంటూరు): బక్రీద్ పండుగ సందర్భంగా గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజులపాటు సెలవులు వచ్చాయి. శని, ఆదివారాలు సాధారణ సెలవులతోపాటు సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని మిర్చి యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యార్డులో 18 నుంచి యథావిధిగా క్రయ విక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయండి

పల్నాడు జిల్లా డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు జిల్లా వ్యాప్తంగా 'నేను బడికి పోతా' కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు నేను బడికి పోతా కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయిలో ఎన్యూమరేటర్లుగా విలేజ్ వలంటీర్లు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్‌పీ, ఐఈఆర్‌పీ, పీటీఐలు, కేజీబీవీలోని సీఆర్‌టీలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో బృందాలుగా ఏర్పాటు చేసి చిన్నారులను బడిలో చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,200, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.

విద్యతో మెరుగైన సమాజం

- పిల్లలను ఉన్నతంగా చదివించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
- బాల కార్మిక వ్యతిరేక నెల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాల కార్మిక వ్యతిరేక నెల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి పార్థసారథి తదితరులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): విద్యతో మెరుగైన సమాజం సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి పేర్కొన్నారు. జాతీయ/ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు చైల్డ్‌రైట్స్ అడ్వొకసి ఫౌండేషన్ భాగస్వామ్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో శుక్రవారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యతిరేక నెల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు ఉన్నతంగా చదివించాలని సూచించారు. పిల్లలందరినీ పాఠశాలలకు పంపే దిశగా తల్లిదండ్రులకు అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాలల చట్టాల గురించి తెలియజెప్పాలని వెల్లడించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ ఎ.అనిత మాట్లాడుతూ విద్యావంతులైన పౌరులతోనే మెరుగైన సమాజాన్ని ఆవిష్కరించగలమని చెప్పారు. కార్మిక శాఖ డీసీ ఎ.గాయత్రి మాట్లాడుతూ 2017–2019తో పోలిస్తే 2023–2024లో బాల కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. జిల్లా బాలల రక్షణాధికారి సీహెచ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల ఒకటి నుంచి 30 వరకు ఎస్సీపీసీ ఆదేశాల మేరకు బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆరుగురు బాల కార్మికులను గుర్తించి, వారిని సంరక్షించామని వెల్లడించారు. చైల్డ్‌రైట్స్ అడ్వొకసి ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కె.సమీర్ మాట్లాడుతూ వేరే రాష్ట్రాల పిల్లలు జిల్లాలో అధికంగా పని చేస్తున్నారని చెప్పారు. బచపన్ బచావో అందోళన్ రాష్ట్ర సమన్వయకర్త జి.తిరుపతిరావు మాట్లాడుతూ పోలీస్ శాఖతో కలిసి బాల కార్మికులను గుర్తించాలని సూచించారు. బాల కార్మికుల చట్టాలపై సీనియర్ ప్యానెల్ న్యాయవాది కె.కాళిదాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్, జిల్లా కార్మిక శాఖ, భారతి సోప్ వర్క్స్ మహిళా సిబ్బంది, క్రాఫ్ జిల్లా సమన్వయకర్తలు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం సందర్శన



విపత్తుల సంస్థ అవలంబిస్తున్న సాంకేతికత గురించి వివరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు నవజ్యోతి మిశ్రా, మండా జావలి ఆల్ఫన్స్, మనోజ్‌రామ్ నాథ్, పాటిల్ దేవరాజ్, రోహిత్‌కుమార్ చౌదరి శుక్రవారం సందర్శించారు. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వారికి సంస్థ విధివిధానాలు వివరించారు. అవలంబిస్తున్న సాంకేతిక పద్ధతుల గురించి చెప్పారు. విపత్తుల సమయంలో నిరంతరం పర్యవేక్షిస్తూ అలర్ట్స్ పంపే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్, వాకీటాకీ, వీ శాట్ కమ్యూనికేషన్ వ్యవస్థల పనితీరును తెలియజేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



78 సార్లు రక్తదానం చేసిన సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న నరసింహారెడ్డి



56 సార్లు రక్తదానం చేసిన భానుమతిని సత్కరిస్తున్న నరసింహారెడ్డి


గుంటూరు సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని కేంద్ర వస్తువులు–సేవల పన్ను శాఖ (సీజీఎస్టీ–గుంటూరు) కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జెడ్పీ ప్రాంగణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యాలయంలో రక్తదాతలను సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు విడనాడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారు అనేక మంది రక్తం దొరకక ప్రాణాలు విడుస్తున్నారని వివరించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విరివిగా రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్తనిల్వలను పెంచుతున్నట్టు వివరించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వడ్లమాని రవి మాట్లాడుతూ రక్తదానం చేస్తే గుండె జబ్బులు దూరమవుతాయని వివరించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆధునిక సదుపాయాలతో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్ ద్వారా 24 గంటలూ రక్త నిల్వలను అందుబాటులో ఉంచుతున్నట్టు వెల్లడించారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ గత ఏడాది కేంద్ర పన్నులశాఖ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో 1,480 మంది రక్తదానం చేశారని, ఒకే రోజులో అధిక సంఖ్యలో రక్తదానం చేసిన ప్రభుత్వ రంగ సంస్థగా కేంద్ర జీఎస్టీ శాఖ కార్యాలయం రికార్డుకు ఎక్కిందన్నారు. రక్తదానంపై అవగాహన కల్పించడంలో విశేషంగా కృషి చేస్తున్న కమిషనర్ నరసింహారెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకుని, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కళాశాలలు, కమ్యూనిటీ కేంద్రాల్లో రక్తదానంపై అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసి, ప్రజల్లో రక్తదానంపై నెలకొన్న అపోహలను తొలగిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా 78 సార్లు రక్తదానం చేసిన సునీల్‌కుమార్, 56 సార్లు రక్తదానం చేసిన ముమ్మనేని భానుమతితోపాటు అధిక సంఖ్యలో రక్తదాన శిబిరాలను నిర్వహించిన రావిపాటి కిరణ్, నరేంద్రకుమార్‌ను సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి రవి శ్రీనివాస్, సభ్యులు వడ్లమాని రాజ్యలక్ష్మి, పాటిబండ్ల శివరంజని, అడపా వేణు, మట్టుపల్లి సునీత పాల్గొన్నారు.

తాడికొండలో 59 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా తాడికొండ మండలంలో 59 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా పెదకాకాని మండలంలో 1 మి.మీ. వర్షం పడింది. సగటున 11.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. గుంటూరు తూర్పు 42.4 మి.మీ., మంగళగిరి 27.2, గుంటూరు పశ్చిమ 25.2, పెదనందిపాడు 21.4, తాడేపల్లి 11.4, కాకుమాను 10.8, తుళ్ళూరు 4.8, ప్రత్తిపాడు మండలంలో 2.2 మి.మీ చొప్పున వర్షం పడింది. జూన్ 14వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 45.3 మి.మీ నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 66.7 మి.మీ వర్షపాతం నమోదైంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.70 అడుగుల వద్ద ఉంది.

క్లుప్తంగా

వృద్ధులకు రైల్వే చార్జీల్లో రాయితీ ఇవ్వాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే చార్జీల్లో రాయితీ కల్పించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివనామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కి రైల్వే చార్జిలలో రాయితీ తీసివేసినందునే దేశవ్యాప్తంగా వృద్ధులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారని అందువల్లనే బీజేపీకి ఓట్లు, సీట్లు తగ్గాయని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వయోధికులకు రాయితీని పునరుద్ధరించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తోందని పేర్కొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులివ్వాలి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): సాగుదారు హక్కుల చట్టాన్ని సవరించి, భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో శుక్రవారం కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి అధ్యక్షతన కౌలు రైతుల సంఘం జిల్లా సమావేశం జరిగింది. జమలయ్య మాట్లాడుతూ భూ యజమాని ప్రమేయం లేకుండానే గ్రామసభల్లో కౌలు రైతులను గుర్తించి సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, కె.వి. జగన్నాథం, ముప్పాళ్ళశివశంకర్, ఆరికపూడి పాపారావు, శంకర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వసతి గృహప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

చిలకలూరిపేట: మండలంలోని మురికిపూడిలో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.రాజాబాబు తెలిపారు. ఐదు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చన్నారు. హాస్టల్‌లో ఎస్సీ 25, ఎస్టీ 5, బీసీ 9, ఓసీ4 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంచి క్రమశిక్షణతో కూడిన విద్య, ఉచిత పౌష్టికాహారం అందిస్తామని వివరించారు. దరఖాస్తు అందించిన వెంటనే అడ్మిషన్ ఇస్తామన్నారు. వివరాలకు 7416516599 నంబరులో సంప్రదించాలన్నారు.

డాక్ పే.. జిందాబాద్

- తపాలా శాఖ ముందంజ
- డిజిటల్ లావాదేవీలు పెంచే దిశగా యాప్
- గూగుల్ పే, ఫోన్‌పేలకు దీటుగా రూపకల్పన
- డాక్ పే లావాదేవీలపై గ్రీవెన్స్ వెసులుబాటు
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 155299

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దేశంలో వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు తపాలాశాఖ వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, కొరియర్, స్పీడ్ పోస్ట్‌తోపాటు బ్యాంకింగ్, గోల్డ్ బాండ్, బీమా తదితర సేవలను ప్రైవేటు సంస్థలకు దీటుగా దిగ్విజయంగా అందిస్తోంది. మరో అడుగు ముందుకేసి డిజిటల్ లావాదేవీల పెంపునకు గూగుల్ పే, ఫోన్ పే మాదిరిగా డాక్ పే అనే యాప్‌ను 2021లోనే దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు దీనిని ప్రజలకు చేరువ చేసే



డాక్ పే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లోగో

దిశగా దూసుకెళుతోంది. ఈ డాక్ పే ద్వారా ప్రజలు డిజిటల్ ఫైనాన్స్ సేవలు పొందడంతోపాటు ఇండియా పోస్టు, ఐపీపీబీ, అందించే బ్యాంకింగ్ సేవలు పొందవచ్చు. డబ్బు పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, డిజిటల్ రూపంలో వ్యాపారులకు నగదు చెల్లించడం లాంటి పనులను చక్కబెట్టుకోవచ్చు. ప్రతి భారతీయుడి అవసరాలను తీర్చేలా డాక్ పే యాప్‌ను రూపొందించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో యూపీఐ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే దిశగా దీనిని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తున్నారు. ఈ యాప్‌ను ఏ బ్యాంకు ఖాతాదారుడైనా వినియోగించవచ్చు.

గ్రీవెన్స్ వెసులుబాటు

గూగుల్ పే, ఫోన్ పే నగదు లావాదేవీల్లో ఏవైనా పొరపాట్లు చోటుచేసుకుంటే ఫిర్యాదులు చేసేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే వాటి కార్యాలయాలు మనకు అందుబాటులో ఉండవు. అయితే డాక్‌పే యాప్ ద్వారా నగదు బదిలీ సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే ఫిర్యాదుల స్వీకరణకు తపాలా శాఖ వెసులుబాటు కల్పించింది. డాక్ పే అనే యాప్ తపాలాశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తుండడంతో మన డబ్బుకు గ్యారెంటీ ఉంటుంది. యాప్ గురించిన సమగ్ర సమాచారం కోసం ఐపీపీబీ టోల్‌ఫ్రీ నంబర్ 155299ను వినియోగదారులు సంప్రదించొచ్చని తపాలా శాఖా అధికారులు చెబుతున్నారు.

గ్రంథాలయ సెస్సు బకాయిల వసూలుపై దృష్టి




సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ, పాల్గొన్న ఉద్యోగులు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాలకు స్థానిక సంస్థల నుంచి రావాల్సిన సెస్సు బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. శుక్రవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని అన్నారు. గ్రంథాలయాల నిర్వహణతోపాటు పాఠకులు ఎక్కువ సంఖ్యలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన సెస్సు బకాయిలపై గ్రంథ పాలకులతో చర్చించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ మల్లంపాటి సీతారామయ్య, గ్రంథపాలకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సులభం

వైద్యశాఖ సిబ్బందికి మూడు రోజుల శిక్షణలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: క్యాన్సర్ వ్యాధిని ముందుగా కనుగొని వెంటనే చికిత్స చేయిస్తే తగ్గించటం చాలా సులభమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పల్నాడు రోడ్డులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో క్యాన్సర్‌పై జిల్లాలోని మెడికల్ ఆఫీసర్స్, ఎంఎల్‌హెచ్‌వో, ఏఎస్ఎంలకు మూడు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ క్యాన్సర్‌లో రకాలైన ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటిని మొదటి స్థాయిలోనే వెంటనే ఏవిధంగా గుర్తించాలో ఈ ట్రైనింగ్ ద్వారా శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇది



శిక్షణలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

వారికెంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణకు హాజరైన వారికి వివరంగా తెలిపారు, జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.హనుమ కుమార్, సీడీఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ స్వర్ణ రాజరాజేశ్వరి, డాక్టర్ సౌమ్య, యన్.సురేష్ పాల్గొన్నారు.

మాతృమరణాలను నివారించాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: మాతృమరణాలు సంభవించకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి ఉన్నత ఆస్పత్రులకు పంపాలన్నారు. సిజేరియన్లు వీలైనంత వరకు తగ్గించాలని సూచించారు. మందుల షాపులు, సిజేరియన్లు ఎక్కువగా జరిగే ఆసుపత్రుల్లో నిత్యం తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డాక్టర్ సిహెచ్ రత్న మన్మోహన్, డాక్టర్ ఇ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గుంటూరు వెస్ట్: దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమలు పెరిగే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. దోమల నివారణకు నీటిలో గంబూషియా చేపల విడుదల, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వినియోగం తదితర చర్యలు చేపట్టాలని చెప్పారు. డెంగీ, మలేరియా ప్రబలుతున్నట్టు సమాచారం ఉందని, వైద్య ఆరోగ్య శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కరపత్రాల ద్వారా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా దోమల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి సుబ్బరామాయణం, జిల్లా మత్స్యశాఖాధికారి గాలి దేముడు, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆర్వో సూపరింటెండెంట్ షాలిని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో ఖరీఫ్ ప్రణాళిక

- అధికారులు తక్షణం సిద్ధం చేయాలి
- సమగ్ర సమాచారం అందుబాటులో ఉండాలి
- జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నున్న వెంకటేశ్వర్లు

తెనాలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గ్రామస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని పాదుపు భవన్‌లో తెనాలి సబ్‌డివిజనులోని తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల పరిధిలోని వ్యవసాయ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రెండుమూడు వారాలుగా చేసిన సూచనల ప్రకారం త్వరగా ప్రణాళికను రూపొందించాలని కోరారు. గ్రామంలో భూమి విస్తీర్ణం, సాగు చేసే విస్తీర్ణం, వేసే పంటలు, కావాల్సిన విత్తనాలు, ఎరువులపై సమగ్ర సమచారంతో నివేదిక తయారు చేయాలని సూచించారు. బీపీటీ-5204, ఇతర రకాలు, ఎంటీయూ విత్తన రకాలు అందుబాటులో ఉన్నాయని రైతులకు చెప్పాలని పేర్కొన్నారు. ఖరీఫ్‌కు భూమి సిద్ధం చేసుకునే క్రమంలో రైతులు పచ్చిరొట్ట పైర్ల సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఇంకా ఎవరికైనా అవసరముంటే సమాచారం ఇవ్వాలన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీకి గ్రామాల వారీగా వివరాలు సేకరించాలని చెప్పారు. భూసార పరీక్షల నిర్వహణకు అవసరమైన మట్టి నమూనాలను సేకరించాల్సి ఉందన్నారు. గతేడాది జిల్లాలో 10 వేల మట్టి నమూనాలను సేకరించామని వెల్లడించారు. పీఎం కిసాన్ పథకం 17వ వాయిదా మొత్తం కేంద్రప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. ఎవరికైనా లబ్ధిదారులకు జమ కాకుంటే కారణాలు తెలుసుకుంటామని చెప్పారు. సబ్‌డివిజన్ వ్యవసాయ అధికారి ఉషారాణి, తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల వ్యవసాయాధికారులు జి.ప్రేమసాగర్, వెంకట్రావు, శిరీష మాట్లాడారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ వేగవంతం

ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: స్టూడెంట్ కిట్ల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్ల స్టాక్ పాయింట్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా పాఠశాలలకు స్టూడెంట్ కిట్ల సరఫరా వివరాలను ఎంఈవోలు జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ నుంచి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సరఫరాదారుల నుంచి వచ్చిన స్టాక్, పాఠశాలలకు పంపిన స్టాక్ వివరాలను పరిశీలించారు. నగర పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు దాదాపుగా స్టూడెంట్ కిట్ల పంపిణీ పూర్తి చేశామని, మరో 60 ప్రాథమిక పాఠశాలలకు పంపాల్సి ఉందని ఎంఈవోలు ఆర్జేడీ దృష్టికి



స్టాల్ బాలికోన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లను పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

తెచ్చారు. అదే విధంగా పాఠ్య పుస్తకాల్లో 7వ తరగతితో పాటు వివిధ తరగతుల వారీగా కొన్ని టైటిల్స్ రావాల్సి ఉన్నాయని తెలిపారు. సంబంధిత ప్రాథమిక పాఠశాలలకు రెండు రోజుల్లోగా స్టూడెంట్ కిట్లను పంపించాలని ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశించారు.

యూబీఐ గృహ, విదేశీ, విద్యా రుణాలు

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం గృహ, విదేశీ విద్యా రుణాల మంజూరు పత్రాలను రుణ గ్రహీతలకు ఆ బ్యాంక్ జోనల్ హెడ్ సి.వి.ఎస్.భాస్కరరావు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో యూనియన్ బ్యాంకు సకాలంలో సరళమైన వడ్డీ రేట్లతో గృహ, విద్యా రుణాలను అందజేస్తోందన్నారు. ముఖ్యంగా స్వదేశీ, విదేశీ విద్యనభ్యసించదలచిన విద్యార్థులకు రూ.40 లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ అవసరం లేకుండా రుణాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ గుంటూరు రీజనల్ హెడ్



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ భాస్కరరావు

ఎస్.జవహర్, రిటైల్ లోను పాయింట్ హెడ్ జీవీ రామాంజనేయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలి

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఉషారాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలన్నారు. కేంద్రాలకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 0-3 సంవత్సరాల దాటిన చిన్నారులందరూ అంగన్‌వాడీ సెంటరులో చేర్పించాలన్నారు. అనంతరం సెంటరులో 16 మంది చిన్నారులకు ప్రీ స్కూలు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఆయనతో పాటు సీడీపీవో ముదివర్తి



పోట్లూరు అంగన్‌వాడీ సెంటరును సందర్శిస్తున్న ఉషారాణి

అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, కార్యకర్త అరుణా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ధైర్యంగా పోరాడుదాం

- పడిలేచే సముద్రపు కెరటాన్ని ఆదర్శంగా తీసుకుందాం
- వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలపై ధైర్యంగా పోరాడుదామని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్త, అభిమాని పడిలేచే సముద్రపు కెరటాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజల మధ్య ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని వైఎస్సార్ సీపీ ఒంటరిగా పోటీచేసి 1,32,84,134 మంది ఓటర్ల (39.37 శాతం) ప్రజాభిమానం పొందిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగనన్న నేతృత్వంలో ప్రజల పక్షాన పోరాడి వారి మద్దతు పొందడానికి నూరు శాతం కష్టపడితే ఫలితం ఖచ్చితంగా వస్తుందన్నారు. దేశ



చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా జగనన్న అనేక సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి గడపకు మేలు చేసినా... 2024 ఎన్నికల సమయంలో అమలు సాధ్యంకాని హామీలను ఇవ్వక పోవడం వలనే ఎన్నికలలో ఓటమి తప్పలేదని గుర్తుంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడ లోపం ఉందో దానిని మనమందరం సరిదిద్దుకుని పార్టీ శ్రేణులకు అండగా ఉండాలన్నారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా జగనన్న రూ.2.73 లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాలలో జమ చేసిన విషయాన్ని ప్రజలు తప్పక మళ్లీ గుర్తుచేసుకుంటారన్నారు. హింసా రాజకీయాలు ఎప్పటికి మంచిదికాదు... సమర్థనీయం కూడా కాదని...చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలపైనే పోరాటం చేద్దామన్నారు. విలువలు, విశ్వసనీయతతోనే రాజకీయాలు చేయాలని జగనన్న ఇచ్చిన పిలుపుతో మనమందరం ధైర్యంగా ప్రజలతో కలిసి ముందుకు వెళదామన్నారు.

ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారించి వారికి రావలసిన అన్ని సౌకర్యాలను కల్పించాలని పల్నాడు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి కోరారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సంఘం పల్నాడు జిల్లా యూనిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఏవైనా కేసులు ఉంటే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినెలా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌డే ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం జిల్లా కార్యదర్శి చుక్కా వెంకటేశ్వర రావు, సంయుక్త కార్యదర్శి సిద్ధాబత్తుని వెంకటేశ్వర రావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి పీటర్‌డామిన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, తాలూకా యూనిట్ అధ్యక్షురాలు ఫ్లోరెన్స్, కార్యదర్శి శ్యామ్, లక్ష్మీజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

ఫిట్‌నెస్ లేని బస్సులపై కేసు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) తీసుకోకుండా నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. డీటీసీ షేక్ కరీం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎఫ్‌సీలు పొందకుండా, నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న వాహనాలపై కేసు నమోదు చేశారు. ఎఫ్‌సీ లేనివి తొమ్మిది, పర్మిట్, కండిషన్స్ ఉల్లంఘున పాటించని మరో 17 బస్సులపై కేసు నమోదు చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ఎఫ్‌సీలు లేకుండా విద్యా సంస్థల వాహనాలు రోడ్డుపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకుంటే బస్సులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్టీఏ అధికారులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బస్సులు తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

జిల్లెలమూడి మహా క్షేత్రంలో వార్షిక అనంతోత్సవాలు

బాపట్ల: జిల్లెలమూడి మహాక్షేత్రంలో వార్షిక అనంతోత్సవాల్ని శుక్రవారం అత్యంత వైభవంగా చేపట్టారు. మాతృశ్రీ అనసూయాదేవి శ్రీ చరణ సన్నిధిలో అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు.వరుణ దేవుని కృప, ఈశ్వరానుగ్రహంతో అమ్మవారి చల్లని చూపులతో చెరువులు, బావులు, నదులు మంచినీటితో పుష్కలంగా నిండిపోవాలని పూజలు నిర్వహించారు. అనంతరంవాత్సల్యాలయంలో లక్ష మల్లెలతో పూలంగి సేవ జరిగింది. కార్యక్రమంలో చైర్మన్ వి.ఎస్.ఆర్. మూర్తి, భక్తులు, విశ్వ జననీ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



వరుస మరిచి ప్రేమ పేరుతో మోసం

యువతిని లోబరుచుకున్న అన్న వరుసయ్యే వ్యక్తి

గుంటూరు రూరల్: వరుస మరిచి యువతికి ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి శారీరకంగా లోబరుచుకున్న యువకుడిపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం.. గుంటూరు తారకరామానగర్ 4వ లైనుకు చెందిన ఓ యువతి రెండేళ్ల క్రితం తన పిన్ని ఊరైన కృష్ణాజిల్లా నందిగామకు వెళ్ళింది. అక్కడ తనకు అన్న వరసయ్యే రంగనాథ్ అనే వ్యక్తి ఆమెను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి శారీరకంగా లోబరుచుకున్నాడు. ఆ తర్వాత కూడా యువతితో సంబంధం కొనసాగించాడు. ఈ నేపథ్యంలో యువతి తనను పెళ్లి చేసుకోవాలని అడగ్గా నిరాకరించాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరిట వంచించి లైంగిక దాడి

నరసరావుపేట టౌన్: పెళ్లి చేసుకుంటానని వంచించి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళతో అదే గ్రామానికి చెందిన యవకుడు పరిచయం పెంచుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. దీంతో ఇద్దరు నరసరావుపేట పట్టణంలోని బాలయ్యనగర్‌కు వచ్చి అక్కడ అద్దె ఇల్లు తీసుకున్నారు. కొన్ని నెలలు సహజీవనం చేసిన అనంతరం యువకుడు పెళ్లికి నిరాకరించటంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

నవపాకాలతో అన్నం వడ్డించినా, చివరలో పెరుగన్నం తినకుండా ఆ భోజనం పరిపూర్ణం అనిపించుకోదు. ఎందుకంటే పెరుగు తినడం ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో అందరికీ తెలుసు. ముఖ్యంగా పెరుగు పొట్టకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రొటీన్, కాల్షియం, ప్రొబయోటిక్స్ సమృద్ధిగా ఉండటం వల్ల పెరుగు వినియోగం ఆరోగ్యానికి చాలా మంచిది. కొందరు చాలా పదార్థాలను పెరుగుతో కలిపి తింటూ ఉంటారు. అయితే, పెరుగుతో కలిపి తినకూడని కొన్ని పదార్థాలు ఉన్నాయి. అవి తినడం ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. పెరుగుతో ఎలాంటి ఆహారపదార్థాలు తినకూడదో... ఎందుకు తినకూడదో తెలుసుకుందాం.

పెరుగుతో వీటిని కలిపి తినకండి



పెరుగు, చేపల మిశ్రమం ఆరోగ్యానికి హానికరం. ఆయుర్వేదం ప్రకారం, చేప, పెరుగు వ్యతిరేక ప్రభావాన్ని కలిగి ఉంటాయి. వీటి కలయికతో చేసిన ఆహారాన్ని తీసుకోవడం శరీరంలో అసమతుల్యతను కలిగిస్తుంది. ఇది అలెర్జీలు, దద్దుర్లు, ఇతర సమస్యల వంటి చర్మ సమస్యలను కలిగిస్తుంది.

సిట్రస్ పండ్లు... పెరుగు: ఇప్పటికే కాస్త పుల్లగా ఉండి, నారింజ, నిమ్మ, ద్రాక్ష తదితర పుల్లని పండ్లతో కలిపి పెరుగు తింటే కడుపులో ఎసిడిటీ పెరుగుతుంది. ఇది జీర్ణ సమస్యలు, అసిడిటీ, కడుపు నొప్పిని కలిగిస్తుంది. పెరుగు, ఉడికించిన గుడ్లు కలిపి తీసుకోవడం మంచిది కాదు. ఈ రెండూ ప్రొటీన్‌కు మంచి మూలాధారాలు. అయితే వీటిని కలిపి తింటే జీర్ణవ్యవస్థపై ఒత్తిడి తెచ్చి, పొత్తికడుపులో భారాన్ని, గ్యాస్‌ను కలిగిస్తుంది.

ఉల్లిపాయ, పెరుగు: వీటి కలయిక జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తుంది. కడుపులో చికాకు, గ్యాస్, ఇతర సమస్యలను కలిగిస్తుంది. **రాత్రిపూట పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిది కాదు.** ఆయుర్వేదం ప్రకారం, రాత్రిపూట పెరుగు తినడం వల్ల కఫ దోషం పెరుగుతుంది. ఇది జలుబు, దగ్గు, కఫం వంటి సమస్యలకు దారితీస్తుంది.

పెరుగు, మామిడికాయల కలయిక రుచికరంగా ఉంటుంది. కానీ ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. మామిడి, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో విషపదార్థాలు ఏర్పడతాయి. ఇది జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలకు దారితీస్తుంది.





ఆరోగ్యమే ఆనందం

అందమే ఆనందం... ఆనందమే జీవిత మకరందం అని ఒక సినిమా పాట ఉంది. అదెంత నిజమో ఆరోగ్యమే ఆనందం అనడం కూడా అంతే నిజం. ఇంకా చెప్పాలంటే అందంగా ఉండేవాళ్లు ఆరోగ్యంగా ఉంటారో లేదో చెప్పలేం కానీ, ఆరోగ్యంగా ఉండేవాళ్లు మాత్రం ఆటోమాటిగ్గానే అందంగా కనిపిస్తారు. అందం మన శరీర ఆకృతి మీద ఆధారపడితే, ఆకృతి అనేది శరీర పోషణ మీద, ఆహారపు అలవాట్లమీద, జీవన శైలి మీదా ఆధారపడి ఉంటుంది. శరీర పోషణ మీద తగిన శ్రద్ధ చూపిస్తూ, క్రమబద్ధంగా వ్యాయామాలు చేస్తూ ఉంటే ఎప్పుడూ అందంగా ఆరోగ్యంగా యవ్వనంగా కనిపిస్తారు. అదెలాగో చూద్దాం.





ఆహారం విషయంలో... శరీరాకృతి విషయంలో క్రమశిక్షణను పాటిస్తే దీర్ఘకాలం పాటు ఎవరికి వాళ్లు మేలు చేసుకున్న వాళ్ళవుతారు. ముందు నుంచి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటే వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఉండగలుగుతారు. జబ్బులేమీ జోలికి రావు. మీరు ఏమి తింటున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్నదాని మీద మీరు ఎలా కనిపిస్తున్నారు, ఎలా ఫీలవుతున్నారనేది ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యంగా వుంటే ఆనందకరమైన జీవితాన్ని గడపగలుగుతారు.

మీ శరీరపు బ్యాటరీని రీఛార్జ్ చేయటానికి, మీ కండరాలలో శక్తిని పెంపొందించటానికి, జబ్బుల్నుంచి దూరంగా ఉండటానికి పెద్దగా కష్టపడి పోవాల్సిన పనేం లేదు. కొద్దిపాటి ఆరోగ్య సూత్రాల్ని పాటిస్తే చాలు. అవేంటో చూద్దామా?

తీసుకునే ఆహారంలో కొన్ని సర్దుబాట్లు చేసుకోవటం, ఎక్సర్‌సైజుల్ని చేయటానికి సమయాన్ని కేటాయించటం, జీవితపు వొత్తిడిల నుంచి రిలాక్స్ కావటానికి ప్రయత్నించటం వంటివి చాలు.



ఆరోగ్యంగా తినాలి

మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి కొవ్వు కూడా అవసరమే. అయితే మనలో చాలామంది శరీరానికి అవసరమైన దాని కంటే 30 శాతం కొవ్వును అధికంగా కలిగి ఉంటున్నారని ఒక అంచనా. అలాంటి హెచ్చుతగ్గుల్ని నివారించటం కోసం ఆహారంలో సమతుల్యాన్ని పాటించటం చాలా అవసరం. ఇందుకోసం...

- రోజూ మీరు తీసుకునే కాయగూరల్లో, ఆకుకూరల్లో వైవిధ్యాన్ని పాటించాలి. కాఫీ, టీ వంటి వాటి విషయంలో మితాన్ని పాటించడం.
- తాగ గలిగినన్ని మంచినీళ్ళను తాగాలి.
- రోజుకు 900 కాలరీల లోపు గల ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.

ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యత

శరీరం తగినంత ఫిట్‌నెస్‌లో ఉంటే అనారోగ్యం తొందరగా దరిచేరదు. బాడీ అలా ఫిట్‌నెస్‌తో ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలి. ఎక్సర్‌సైజుల మూలంగా గుండె కండరాలు బలపడతాయి. శరీరంలో రక్తసరఫరా సాఫీగా జరుగుతుంది. రక్తంలో కొలెస్టరాల్ తగ్గుతుంది. శరీరం బరువు ఉండాల్సిన రీతిలో ఉంటుంది. ఇవన్నీ టెన్షన్ తగ్గించే అంశాలు. ఎక్సర్‌సైజులంటే – నడక, సైకిలింగ్, ఈత మొదలైనవి ఏవైనా సరే. దీనిని మాత్రం ప్రోగ్రాముగు నిదానంగా ప్రారంభించాలి. క్రమక్రమంగా పెంచుకుంటూ పోవాలి. అంతే తప్ప తొందరపడి ప్రారంభంలోనే అతిగా చేయకూడదు.



- **పోషకవిలువలు**

శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే 13 ముఖ్య విటమిన్లు, 25 ఖనిజ లవణాలు మనం తీసుకునే ఆహారంలో తగు పరిమాణంలోలభించాలి కాబట్టి సమీకృత ఆహారాన్ని తీసుకోవాలి.

- **ధూమపానం, మద్యపానాలకు స్వస్తి:** పొగ తాగేవాళ్ళకు, మద్యం సేవించే వాళ్లకు గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు రావటానికి రెట్టింపు అవకాశాలున్నాయి కాబట్టి ఈ రెండు అలవాట్లూ ఉన్న వాళ్లు వాటిని మానుకోవటం మంచిది. ప్రారంభంలో కొంచెం కష్టం కావచ్చు గాని గట్టిగా సంకల్పించుకుంటే అసంభవం మాత్రం కాదు కదా...

- **మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి**

రోజుకి అరగంట కాలాన్ని మనస్సు ప్రశాంతపరచుకోవటానికి కేటాయించాలి. మంచి పుస్తకాన్ని చదవటం, ధ్యానం, సంగీతం వినడం వంటి వాటి ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. గతంలో జరిగిన తప్పులు, పొరపాట్లు, అపజయాల గురించి ఆలోచించకుండా భవిష్యత్తుపట్ల ఆశావహ దృక్పథంతో వర్తమానంలో జీవించాలి.

- **శరీరం చెప్పేది వినాలి**

ఆఖరుగా ఆరోగ్యంగా ఉండాలంటే శరీరం చెప్పే దానిని వినాలి. శరీరం ఏ ఇబ్బందికి గురవుతున్నా – అంటే అస్వస్థతలకు గురవుతున్నా మనకు కొన్ని సూచనలను అందిస్తుంది. జ్వరం, నొప్పి, దగ్గు, వాంతులు, విరోచనాలు, ఇలాంటి లక్షణాల ద్వారా శరీరంఅనారోగ్య సూచనలను వెలువరిస్తుంటుంది. అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించి, వారి సూచనల మేరకు శరీరాన్ని కండిషన్‌లోకి తెచ్చుకోవడం ఎవరికి వారు అనుసరించి తీరాల్సిన కర్తవ్యం.

జుట్టు రాలడం... బరువు తగ్గడం
జింక్ లోపం కావచ్చు!

అకారణంగా జుట్టు రాలుతున్నా, బరువు తగ్గుతున్నా, గాయాలు త్వరగా నయం కాకపోతున్నా జింక్ లోపంగా అనుమానించాలి. ఇదే కాదు, శరీరంలో జింక్ లోపం ఉన్నప్పుడు ఇంకా ఎలాంటి లక్షణాలు ఉంటాయో, నివారణకు ఏం చేయాలో తెలుసుకుందాం.

మన శరీరానికి జింక్ చాలా అవసరం. మనం తినే ఆహారంలో చాలా పరిమిత పరిమాణంలో మాత్రమే జింక్ లభిస్తుంది. శరీరం జింక్‌ను నిల్వ చేసుకోదు. అందుకే జింక్ లభించే ఆహారాన్ని రోజూ తినాలి. జింక్ లోపిస్తే శరీరంలో చాలా మార్పులు జరుగుతాయి. రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. జింక్ లోపాన్ని కొన్ని లక్షణాల ద్వారా తెలుసుకోవచ్చు.

గాయాలు నయం కాకపోవడం: చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు, గాయాలైనప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేసేందుకు జింక్ చాలా అవసరం. జింక్ లోపం ఏర్పడినప్పుడు గాయాలు తగిలినా అవి త్వరగా నయం కావు. అంతేకాదు ముఖంపై మొటిమలు వస్తాయి.

బరువు తగ్గడం: జింక్ లోపం వల్ల జీర్ణశక్తిలో మార్పులు వస్తాయి. ఆకలి మందగిస్తుంది. ఆహారం తినాలనిపించదు. ఫలితంగా బరువు తగ్గిపోతారు. ఇలా పోషకాల లోపం వల్ల బరువు తగ్గడంతోపాటు అనేకమైన ఇతర ఆరోగ్యసమస్యలూ ఉత్పన్నమవుతాయి.

జుట్టు రాలడం: జింక్ లోపం వల్ల జుట్టు చిట్లడం, రాలడం అధికమవుతుంది కాబట్టి అకారణంగా జుట్టు రాలుతున్నా, జుట్టు పలుచబడుతున్నా జింక్ లోపమేమో అనుమానించాలి. దానికి సంబంధించిన సప్లిమెంట్స్ తీసుకుని సమస్య సద్దుమణిగితే నిశ్చింతగా ఉండవచ్చు.

తరచూ జలుబు: జింక్ తగ్గితే రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. దానివల్ల తరచూ జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఎక్కువ. తరచూ మీకు జలుబు చేస్తున్నా, అనారోగ్యం బారిన పడుతున్నా జింక్ లోపం ఉందేమో చూసుకోవాలి. జింక్ తగినంత అందితే జలుబు త్వరగా తగ్గుతుంది.



చూపు మసక బారడం: ఆరోగ్యకరమైన చూపుకు జింక్ చాలా అవసరం. శరీరానికి తగినంత జింక్ అందనప్పుడు దృష్టి మందగిస్తుంది. చూపు మసకగా కనిపిస్తుంది. అస్పష్టంగా అనిపిస్తుంది. జింక్, విటమిన్ ఎ ఆరోగ్యకరమైన చూపును ఇస్తాయి.

అయోమయం: మీకు మనసు, ఆలోచనలు గందరగోళంగా ఉన్నాయా? అయితే జింక్ లోపం ఉందేమో చూసుకోండి. జింక్ తగినంత అందకపోతే మెదడు సరిగా పనిచేయదు. పనిపై ఏకాగ్రత్ కుదరదు. జ్ఞాపకశక్తి సమస్యలకు కూడా తలెత్తుతాయి.

సంతానోత్పత్తిపై ప్రభావం: జింక్ లోపం పురుషులకు చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. దీని వల్ల పురుషుల సంతానోత్పత్తి ప్రభావితమవుతుంది. మీరు తండ్రి కావాలనుకుంటే తప్పనిసరిగా జింక్ తీసుకోవడంపై శ్రద్ధ వహించాలి. తగినంత పరిమాణంలో జింక్ తీసుకోని పురుషులు తండ్రి కావడానికి చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

రోగనిరోధక శక్తి బలహీనం: శరీరానికి సంబంధించి అనేక విధులకు జింక్ అవసరమవుతుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. మళ్లీ మళ్లీ అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతుంది. కానీ మీ శరీరంలో జింక్ లోపం ఉంటే అది రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుందని గుర్తుంచుకోండి.

ఇలా నివారించాలి: జింక్ లోప నివారణకు శనగలు, గింజ ధాన్యాలు, పుచ్చగింజలు, జనపనార గింజలు, ఓట్స్, జీడిపప్పు, పెరుగు, డార్క్ చాకొలెట్లలో జింక్ పుష్కలంగా లభిస్తుంది కాబట్టి జింక్ లోపం ఉన్నవారు ఈ ఆహార పదార్థాలు తీసుకోవడం ఉత్తమం.

సినిమా

కన్నప్ప కథని కృష్ణంరాజు ఇచ్చారు – మోహన్‌బాబు



● ప్రీతి, విష్ణు, శరత్ కుమార్, మోహన్‌బాబు, ముఖేష్ కుమార్

''కన్నప్ప' సినిమా ప్రారంభానికి ముందు కృష్ణంరాజుగారిని కలిశాను. విష్ణు కోసం 'కన్నప్ప' మూవీ తీయాలనుకుంటున్నానని చెప్పాను. ప్రభాస్ కోసం రాసుకున్న ఈ కథను ఆయన మాకు ఇచ్చారు'' అని నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతీ ముకుందన్ కీలక పాత్రల్లో నటించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై డా. మోహన్ బాబు నిర్మించారు. శుక్రవారం ఈ మూవీ టీజర్ రిలీజ్ వేడుకలో మోహన్‌బాబు మాట్లాడుతూ– ''కన్నప్ప' కేవలం భక్తి చిత్రమే కాదు.. అన్ని రకాల అంశాలుంటాయి. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం. మా టీమ్‌కి అందరి ఆశీస్సులు కావాలి'' అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ– ''2014లో 'కన్నప్ప' ప్రయాణం ప్రారంభమైంది. మోహన్‌బాబు గారు, విన్ని, వినయ్ ఇచ్చిన ప్రోత్సాహం, శివుడి అనుమతి వల్లే 'కన్నప్ప'ను తెరపైకి తీసుకురాగలిగాను. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ముందుకు వెళ్లాం. ఇకపై ప్రతి సోమవారం ఈ మూవీ నుంచి అప్‌డేట్ వస్తూనే ఉంటుంది'' అన్నారు. ''మనం దేవుడి దగ్గరకు వెళ్లి కోరికలు కోరతాం. కానీ ఏం కోరకుండా దేవుడికే నేత్రాలను సమర్పించారు కన్నప్ప. అలాంటి గొప్ప భక్తుడి కథను చెప్పాం'' అన్నారు ముఖేష్ కుమార్ సింగ్. ''కన్నప్ప' కేవలం సినిమా కాదు... మన చరిత్ర'' అన్నారు శరత్ కుమార్. మధుబాల, ప్రీతీ ముకుందన్ కూడా మాట్లాడారు.



శ్రీలీల

నా ముందు సైలెంట్‌గా ఉండాలి!

తెలుగు చిత్ర పరిశ్రమలో బిజీగా దూసుకెళుతున్నారు యంగ్ బ్యూటీ శ్రీలీల. ప్రస్తుతం నితిన్‌తో 'రాబిన్‌హుడ్', రవితేజ 'ఆర్‌టీ 75' (వర్కింగ్ టైటిల్) వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. కాగా శుక్రవారం (మే 14) శ్రీలీల బర్త్‌డే. ఈ సందర్భంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'రాబిన్‌హుడ్'లో ఆమె చేస్తున్న లేడీ బాస్ నీరా వాసుదేవ్ పాత్ర లుక్, టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''జ్యోతీ... సునామీలో టి సైలెంట్ ఉండాలి... నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి' అంటూ శ్రీలీల చెప్పిన డైలాగ్ టీజర్‌లో ఉంది. 'ఎక్స్‌ట్రాఆర్డినరీ మ్యాన్' (2023) చిత్రం తర్వాత హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'యునిక్ యాక్షన్, ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'రాబిన్‌హుడ్' రూపొందుతోంది. ఈ చిత్రంలో నితిన్ పాత్రకు శ్రీలీల పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. వారి పాత్రలు రాయడంలో వెంకీ కుడుముల స్పెషల్ కేర్ తీసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 20న మా సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

మీకు ఏం గుర్తొస్తుంది?



● శ్రీవిష్ణు

'మగాడంటే మీకు ఏం గుర్తొస్తుంది' అని శ్రీవిష్ణు చెప్పే డైలాగ్‌తో 'శ్వాగ్' మూవీ టీజర్ రిలీజ్ అయింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఈ చిత్రంలో రీతూ వర్మ, మీరా జాస్మిన్, దక్ష నగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు కీలక పాత్రల్లో నటించారు. హసిత్ గోలి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మించారు. ఈ చిత్రంలోని అన్ని ప్రధాన పాత్రలను పరిచయం చేసిన మేకర్స్ శుక్రవారం టీజర్‌ని రిలీజ్ చేశారు. 'ఆడవాళ్లని ఏం అడుక్కోనక్కర్లేదు... మగవాడినే అనుసరించాలి. వంశాలైనా, ఆస్తులైనా, ఆడవాళ్లయినా..' అంటూ శ్రీవిష్ణు చెప్పే డైలాగులు ఈ టీజర్‌లో ఉన్నాయి. ''ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా 'శ్వాగ్' రూపొందింది. శ్రీవిష్ణు హిలేరియస్ రోల్‌లో కనిపించనున్నారు. త్వరలో సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

సింగమ్ వాయిదా



● అజయ్ దేవగన్

ఈ దీపావళికి బాలీవుడ్ సింగమ్‌లా మరోసారి థియేటర్స్‌కు రానున్నారు అజయ్ దేవగన్. హిందీ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన 'సింగమ్ (2011), సింగమ్ రిటర్న్స్' (2014) తర్వాత హీరో అజయ్ దేవగన్, దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'సింగమ్ ఎగైన్'. అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, జాకీ ష్రాఫ్, కరీనా కపూర్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అజయ్ దేవగన్, జ్యోతిదేశ్ పాండే, రోహిత్ శెట్టి నిర్మిస్తున్న 'సింగమ్ ఎగైన్' చిత్రాన్ని తొలుత ఆగస్టు 15న విడుదల చేయాలనుకున్నారు. కానీ చిత్రీకరణ ఇంకా పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారట. దీపావళికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ లక్ష్యం అదే – రామ్‌గోపాల్ వర్మ



''చిత్ర పరిశ్రమలోకి రావాలనుకునే యువ ప్రతిభావంతులను ప్రోత్సహించడమే తమ 'ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్' లక్ష్యం'' అన్నారు దర్శక–నిర్మాత రామ్‌గోపాల్ వర్మ. శుక్రవారం విలేకరుల సమావేశంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''నా మొదటి సినిమా 'శివ' అప్పుడు నా గురించి ఎవరికీ తెలియదు. ఆ చిత్రం హిట్టవ్వడం వల్లే నేనెవరో అందరికీ తెలిసింది. మా నాన్న అన్నపూర్ణ స్టూడియోలో సౌండ్ ఇంజినీర్ కాబట్టి ఇండస్ట్రీలోకి వచ్చేందుకు నాకు వీలు దొరికింది. కానీ ప్రతిభ ఉండి నాలాగా ఇంకా ప్రపంచానికి తెలియాల్సిన వారు ఎందరో బయట ఉన్నారు. అలాంటి వారికి ఇండస్ట్రీతో ఒక యాక్సెస్ ఇచ్చే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కాంటెస్ట్ ఆర్జీవీ యువర్ ఫిల్మ్. ఈ కాంటెస్ట్‌కి వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 400 ఎంట్రీలు వచ్చాయి. వీటిలో 11 షార్ట్ ఫిలింస్‌ని ఎంపిక చేశాం. వీటిని సోషల్ మీడియాలో పోల్‌కు పెట్టి ప్రేక్షకులు ఎక్కువ మంది బెస్ట్ డైరెక్టర్‌గా ఓటు వేసిన వారికి మా సంస్థలో చాన్స్ ఇస్తాం. డైరెక్టర్స్ అనే కాదు కెమెరా, మ్యూజిక్ డైరెక్షన్ ఇలా.. ప్రతి క్రాఫ్ట్‌లో ప్రతిభ ఉన్నవారిని ఎంపిక చేస్తున్నాం. సెలెక్ట్ అయిన వారి ప్రతిభను ముందుగా మా సంస్థలో ఉపయోగించుకోవాలనేది నా, నిర్మాత రవి స్వార్థం'' అన్నారు. నిర్మాత రవి కూడా పాల్గొన్నారు.

విశ్వంభరలో...



● కునాల్ కపూర్

'విశ్వంభర' ప్రపంచంలోకి వచ్చాడు బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఇందులో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆషికా రంగనాథన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. అలాగే హిందీలో 'రంగ్ దే బసంతి, డాన్ 2, డియర్ జిందగీ' వంటి సినిమాల్లో నటించిన కునాల్ కపూర్ 'విశ్వంభర'లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రం వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... నాగార్జున, నాని కాంబినేషన్‌లో రూపొందిన 'దేవదాస్' (2018)లో కునాల్ నటించారు. నాలుగేళ్లకు తెలుగులో 'విశ్వంభర' కమిట్ అయ్యారు.

స్త్రీ సీక్వెల్ సిద్ధం



● శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు

బాలీవుడ్ బాక్సాఫీస్ హిట్ ఫిల్మ్ 'స్త్రీ' సీక్వెల్ విడుదలకు సిద్ధమైంది. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ లీడ్ రోల్స్‌లో నటించిన కామెడీ హారర్ ఫిల్మ్ 'స్త్రీ'. అమర్‌కౌశిక్ దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'స్త్రీ 2' రూపొందింది. తొలి భాగంలో నటించిన రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్, పంకజ్ త్రిపాఠి, అభిషేక్ బెనర్జీ సీక్వెల్‌లోనూ నటించారు. అమర్ కౌశిక్‌యే దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, జ్యోతిదేశ్ పాండే ఈ సినిమాను నిర్మించారు. తొలుత 'స్త్రీ 2'ని ఆగస్టు 31న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. అయితే ఓ 15 రోజుల ముందే ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లుగా శుక్రవారం వెల్లడించారు.

స్పీల్‌బర్గ్ డైరెక్షన్‌లో...



● ఎమిలీ బ్లంట్

'ది ఫాబెల్ మ్యాన్స్' (2022) చిత్రం తర్వాత హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ తదుపరి చిత్రం గురించి ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే స్పీల్‌బర్గ్ తర్వాతి సినిమా గురించి అతి త్వరలోనే కొత్త కబురు వినిపించనుందని హాలీవుడ్ టాక్. హాలీవుడ్ ప్రముఖ నటి ఎమిలీ బ్లంట్ లీడ్ రోల్‌లో స్పీల్‌బర్గ్ ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నారట. ఈ సినిమా గురించి ఎమిలీతో చర్చించారట కూడా. త్వరలోనే ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందని టాక్. ఓ వాస్తవ ఘటన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను 2026 వేసవిలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారట స్పీల్‌బర్గ్.

బాల్యం గొప్పది



నటి, నిర్మాత నిహారిక కొణిదెల సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదు వంశీ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సాయికుమార్, సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, ప్రసాద్ బెహరా, రాధ్య, తేజస్వి రావు, టీనా శ్రావ్య, విషిక లీడ్ రోల్స్‌లో నటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని హీరో నితిన్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''యువత అయినా, పెద్దవాళ్లైనా ఏదో ఒక సందర్భంలో చిన్నతనమే బాగుందని అనుకుంటుంటారు. ఎలాంటి పొరపొచ్చాలు, అడ్డుగోడలు, బాధలు లేకుండా స్నేహితులతో కలిసి సరదాగా గడిపే బాల్యమే ఎంతో గొప్పది. ఈ పాయింట్ ఆధారంగా చేసుకుని నిర్మించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ప్రస్తుతం మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే మూవీ విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.